# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 26-05-2026** **సమయం : 1.20 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1) గోదావరి నది కాలుష్య నివారణకోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి కె. పవన్ కళ్యాణ్ చెప్పారు.**

**2) విద్యుత్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకు వస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ పేర్కొన్నారు.**

**3) రాష్ట్రంలో రాగల 4 రోజులు ఎండల తీవ్రత ఎక్కువగా ఉండే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ సూచించారు.**

**4) కృత్రిమ మేధా ఆధారిత ఆరోగ్య వ్యవస్థ-వ్యూహాత్మక భాగస్వాముల సదస్సు మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమం ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతుంది.**

==========================

గోదావరి నది కాలుష్య నివారణకోసం ప్రత్యేక టాస్క్ ఫోర్స్ ఏర్పాటు చేస్తున్నట్లు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ చెప్పారు. తూర్పుగోదావరి జిల్లాలో ఆయన రెండో రోజు పర్యటిస్తున్నారు. గోదావరిలో కాలుష్యానికి గురవుతున్న ప్రాంతాలను ఈ రోజు ఆయన క్షేత్ర స్థాయిలో పరిశీలించారు. వెంకటనగరం వద్ద ఆంధ్రా పేపర్ మిల్స్ వ్యర్థాలు కలిసే చోటును పరిశీలించారు. పరిశ్రమ నుంచి వ్యర్థాలు నేరుగా గోదావరిలో కలుస్తుండటంపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. కలుషిత నీటి నమూనాలను సేకరించి పరీక్షలకు పంపాలని, వెంటనే నివారణ చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం రాజమహేంద్రవరంలోని నల్లా ఛానల్ మురుగునీటి శుద్ధి కేంద్రాన్ని తనిఖీ చేసారు. క్షేత్రస్థాయిలో అధికారుల సమస్యలపై, ముఖ్యమంత్రితో, కాబినెట్ లో మాట్లాడి పరిష్కరిస్తానని పవన్ కళ్యాణ్ హామీ ఇచ్చారు. అక్కడి నుంచి రాజమహేంద్రవరం మున్సిపల్ కార్యాలయానికి చేరుకుని జిల్లా అధికారులతో ఉపముఖ్యమంత్రి సమావేశమయ్యారు.

--------------------------

విద్యుత్ సమస్యల పరిష్కారానికి రాష్ట్ర వ్యాప్తంగా 1912 టోల్ ఫ్రీ నంబర్ అందుబాటులోకి తీసుకు వస్తున్నామని విద్యుత్ శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్ చెప్పారు. ఇటీవలి కాలంలో వాతావరణంలో వస్తున్న మార్పుల వల్ల పలుచోట్ల విద్యుత్ సరఫరాలో అంతరాయం తలెత్తుతోందని మంత్రి పేర్కొన్నారు. గుంటూరు జిల్లా అమరావతి సచివాలయంలో ఈరోజు ఆయన విలేకరులతో మాట్లాడుతూ.... అధిక ఉష్ణోగ్రతల వల్ల విద్యుత్ వినియోగం రాష్ట్రంలో గణనీయంగా పెరిగిందని అన్నారు. రాష్ట్ర అవసరాలకు సరిపడా విద్యుత్ అందుబాటులో

ఉందని మంత్రి వివరిస్తూ...

వాయిస్...30 సెకన్లు

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లోని మునిసిపాలిటీల్లో వివిధ పథకాల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై పురపాలక శాఖ మంత్రి నారాయణ సమీక్ష నిర్వహించారు. అమరావతి లోని సచివాలయంలో నిన్న జరిగిన ఈ సమావేశంలో అమృత్ 2. పట్టణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధి– UIDF, ఆసియన్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్– A.I.I.B– పథకాల ద్వారా చేపట్టిన పనుల పురోగతిపై చర్చించారు. ప్రతి ఇంటికీ మంచి నీటి కొళాయిల ఏర్పాటు, అండర్ గ్రౌండ్ డ్రైనేజి, వాటర్ బాడీల అభివృద్ధి పనులకు సంబంధించి పెండింగ్ డిజైన్ లను త్వరగా ఖరారు చేయాలని, పనులు ప్రారంభం కాని చోట్ల త్వరితగతిన పనులు ప్రారంభమయ్యేలా చర్యలు చేపట్టాలని మంత్రి నారాయణ సూచించారు.

---------------------------

ఏపీ ఎడ్‌సెట్–2026 పరీక్షా ఫలితాలను విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ విడుదల చేసారు. పరీక్షకు హాజరైన వారిలో 99.3 శాతం మంది ఉత్తీర్ణత సాధించారు. అర్హత సాధించిన అభ్యర్థులందరికీ మంత్రి లోకేష్ అభినందనలు తెలిపారు. ర్యాంక్ కార్డుల కోసం cets.apsche.ap.gov.in/EDCET వెబ్‌సైట్‌ను చూడవచ్చు. లేదా వాట్సాప్‌లో 9 55 23 00 00 9 నంబర్ ద్వారా ఫలితాలు పొందవచ్చు.

---------------------------

వక్ఫ్ ఆస్తులను సమర్థవంతంగా వినియోగించి పేద ప్రజలకు ఉపయోగపడేలా కార్యాచరణ రూపొందించాలని మైనార్టీ సంక్షేమ శాఖ మంత్రి ఎన్ ఎండీ ఫరూక్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ వక్ఫ్ బోర్డ్ ఆధ్వర్యంలో నిర్వహించిన తాలిం–ఏ–హునర్ టాలెంట్ టెస్ట్ ఫలితాలను నంద్యాలలోని ఎన్టీఆర్ షాదీఖానాలో వక్ఫ్ బోర్డ్ చైర్మన్ అబ్దుల్ అజీజ్‌తో కలిసి మంత్రి నిన్న విడుదల చేశారు. రాష్ట్రవ్యాప్తంగా 7 వేల 392 మంది విద్యార్థులు దరఖాస్తు చేసుకోగా వీరిలో ప్రతిభ కనబరిచిన 250 మంది విద్యార్థులను ఎంపిక చేశారు. తదుపరి ర్యాంకులు సాధించిన 50 మందిని రిజర్వ్ జాబితాలో ఉంచారు. ఈ సందర్భంగా మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. ముఖ్యంగా బాలికల విద్యకు మరింత ప్రోత్సాహం అందించాలని ఇందుకోసం ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం అందిస్తామని ఎన్ఎండి ఫరూక్ వివరిస్తూ ..

వాయిస్...27 సెకన్లు

---------------------------

రాష్ట్రంలో ఎండల తీవ్రత శనివారం వరకు కొనసాగే అవకాశం ఉందని రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ హెచ్చరించారు.. ఈ రోజు 26 మండలాల్లో తీవ్ర వడగాల్పులు, 137 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉందని తెలిపారు. ఏలూరు, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, పల్నాడు, బాపట్ల, మార్కాపురం, ప్రకాశం జిల్లాల్లో...45 డిగ్రీల నుంచి 46 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఇక విజయనగరం, మన్యం, అల్లూరి సీతారామ రాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పు–పశ్చిమ గోదావరి జిల్లాలో .. 42 నుంచి 44 డిగ్రీల వరకు ఉష్ణోగ్రత నమోదయ్యే అవకాశం ఉందని తెలిపారు. ఎండల తీవ్రతపట్ల ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని... అత్యవసరమైతే తప్ప బయటకు రావద్దని సూచించారు.

---------------------------

అక్టోపస్ బేసిక్ ట్రైనింగ్ లో భాగంగా గుంటూరు జిల్లా మంగళగిరిలోని శ్రీ లక్ష్మీనరసింహ స్వామి దేవాలయం ఆవరణలో మాక్ డ్రిల్ నిర్వహించారు. డీఎస్పీ అక్టోపస్ ఆధ్వర్యంలో 24 మంది సిబ్బందితో ఈ మాక్ డ్రిల్ ఈరోజు తెల్లవారుఝామున జరిగింది. రాష్ట్రవ్యాప్తం గా దేవాలయాలపై ఉగ్రవాదుల దాడులు ఎలా అరికట్టాలనే చర్యల్లో భాగంగా ఈ మాక్ డ్రిల్ కార్యక్రమం నిర్వహించారు. దేవాలయంలోని భక్తులను ఏ విధంగా రక్షించాలి.... ప్రాణ నష్టం లేకుండా అనుసరించాల్సిన రక్షణ చర్యలను మాక్ డ్రిల్ ద్వారా డీఎస్పీ భక్తులకు వివరించారు.

---------------------------

కృత్రిమ మేధా ఆధారిత ఆరోగ్య వ్యవస్థ–వ్యూహాత్మక భాగస్వాముల సదస్సు మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ ఫైనల్ కార్యక్రమం ఈరోజు గుంటూరు జిల్లా మంగళగిరిలో జరుగుతుంది. ఆరోగ్య రంగంలో వివిధ కార్యకలాపాలు నిర్వహిస్తున్న అంకుర సంస్థలు, ఏజెన్సీల ముఖ్య ప్రతినిధులు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అధికారులు, ఇతర రంగాలకు చెందిన సుమారు 300 మంది ప్రతినిధులు ఈ సదస్సుకి హాజరుకానున్నారు. ప్రభుత్వాసుపత్రు ల్లో పైలట్ ప్రాజెక్ట్ గా చేపట్టిన కార్యక్రమలో – ఏఐ ఆధారిత సేవలు అందించిన అంకుర సంస్థల ప్రతినిధులు తమ అనుభవాలను ఈ సదస్సులో దృశ్య మాధ్యమంలో వివరించనున్నారు. మెడ్ టెక్ ఛాలెంజ్ గ్రాండ్ లో విజేతలుగా నిలిచే అంకుర సంస్థలకు రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ నగదు పారితోషికాలు అందచేస్తారు.

---------------------------

జులై 1 నుంచి చేపట్టే ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పార్వతీపురం మన్యం జిల్లా రెవెన్యూ అధికారి కె. హేమలత కోరారు. జిల్లాలోని గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రతినిధులతో ఆమె నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఎస్ఐఆర్ అమలుకు సంబంధించి ఎన్నికల సంఘం విడుదల చేసిన షెడ్యూల్‌ను రాజకీయ పార్టీ ప్రతినిధులకు వివరించారు. ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా జూన్ 5 నుండి 14 వరకు సిబ్బందికి శిక్షణ, ముద్రణ కార్యక్రమాలు నిర్వహిస్తామని పేర్కొన్నారు. అనంతరం జూన్ 15 నుండి జూలై 14 వరకు బూత్ లెవల్ అధికారులు ఇంటింటి సర్వే చేపడతారని తెలిపారు. పోలింగ్ స్టేషన్ల పరిశీలన, తనిఖీ జూలై 14 నాటికి పూర్తి చేయడానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు. జూలై 21న ముసాయిదా ఓటరు జాబితా ప్రచురిస్తారని, ఆ తేదీ నుండి ఆగష్టు 20 వరకు అభ్యంతరాలు, క్లెయిమ్‌ల స్వీకరణ కార్యక్రమం జరుగుతుందన్నారు. వచ్చిన అభ్యంతరాల పరిశీలన, పరిష్కార ప్రక్రియను సెప్టెంబర్ 18 నాటికి పూర్తి చేసి, తుది ఓటరు జాబితాను 22 న ప్రచురించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి వివరించారు.

---------------------------

ఆఫ్రికా దేశంలో ఎబోలా వైరస్ కేసులు పెరుగుతున్న నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటోంది. కృష్ణాజిల్లా గన్నవరం అంతర్జాతీయ విమానాశ్రయం వద్ద ఈరోజు ఎబోలా స్క్రీనింగ్ శిబిరం నిర్వహించారు. సింగపూర్ నుంచి వచ్చిన 185 మంది ప్రయాణికులకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన వైద్య బృందం ప్రత్యేక వైద్య పరీక్షలు నిర్వహించింది. ప్రయాణికుల ఆరోగ్య పరిస్థితిని పరిశీలించి, అవసరమైన జాగ్రత్తలు చెప్పారు. విదేశాల నుంచి వచ్చే ప్రయాణికుల ఆరోగ్య భద్రత కోసం విమానాశ్రయంలో నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నట్లు ఆరోగ్య శాఖ వైద్య అధికారి డాక్టర్ సృజన వివరిస్తూ ...

వాయిస్...30 సెకన్లు

====================